సాక్షి అన్నమయ్య జిల్లా

మంగళవారం | 24 | జనవరి | 2023



నిరుద్యోగులకు శిక్షణ.. ఉద్యోగ కల్పన

గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. - 8లో



క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం కృషి చేస్తోందని రీజనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి భాను మూర్తి అన్నారు విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. - 8లో

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

	కనిష్టం	గరిష్టం
మొదటిరకం	రూ.180	రూ.230
రెండోరకం	రూ.90	రూ.178



మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 155 మెట్రిక్ టన్నులు

పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

రకం	కనిష్టం	గరిష్టం
బైవోల్టిన్	690	721
సీబీ	-	-



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 125.08 కిలోలు

న్యూస్‌రీల్

నవోదయ ప్రవేశ పరీక్షకు దరఖాస్తు చేసుకోండి

రాయచోటి అర్బన్ : రాజంపేట జవహర్ నవోదయ విద్యాలయం ప్రవేశపరీక్ష -2023కు అర్హులైన విద్యార్థులు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని అన్నమయ్య జిల్లా డీఈఓ రాఘవరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. www.navodaya.in వెబ్‌సైట్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. 2022-23 విద్యాసంవత్సరం ఉమ్మడి వైఎస్సార్ జిల్లాలోని ప్రభుత్వ, ప్రభుత్వ గుర్తింపు పొందిన పాఠశాలల్లో 5వ తరగతి చదువుతున్న విద్యార్థులు అర్హులన్నారు. మే1, 2011 నుంచి ఏప్రిల్30,2013 మధ్యలో జన్మించిన వారు మాత్రమే దరఖాస్తు చేసుకోవాలన్నారు. అవకాశాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

పంచాయతీ కార్యాలయంలో ఏసీబీ అధికారుల తనిఖీ



రికార్డులను పరిశీలిస్తున్న ఏసీబీ అధికారులు

సిద్దవటం : మండలం లోని మాధవరం-1 గ్రామ పంచాయతీ కార్యాలయంలో ఇంటి పన్నుల్లో జరిగిన అవకతవకలపై సోమవారం కడప ఏసీబీ సీఐ ఎల్లమరాజు, రైటర్ నారాయణలు తనిఖీలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ జానకిరామయ్య, పంచాయతీ కార్యదర్శి లక్ష్మి నరసయ్యలు సంబంధిత రికార్డులను వారికి అందజేశారు. అనంతరం ఏసీబీ సీఐ ఎల్లమరాజు మాట్లాడుతూ మాధవరం-1 గ్రామ పంచాయతీలో ఇంటి పన్నులకు సంబంధించి 2015 సంవత్సరం నుంచి 2022 వరకు రూ. 30 లక్షలు గోల్‌మాల్ జరిగాయని స్థానిక సర్పంచ్ జానకిరామయ్య ఫిర్యాదు చేశారన్నారు. కార్యాలయంలోని పలు రికార్డులను తనిఖీ చేశామన్నారు. పూర్తి స్థాయిలో రికార్డులను పరిశీలించిన అనంతరం నివేదికను ఉన్నతాధికారులకు అందజేస్తామని ఆయన తెలిపారు.

3న జెడ్పీ సర్వసభ్య సమావేశం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లా పరిషత్ సర్వసభ్య సమావేశం ఫిబ్రవరి 3వ తేదీ ఉదయం 10.00 గంటలకు కడపలోని జెడ్పీ సమావేశ మందిరంలో జరుగుతుందని ముఖ్య కార్యనిర్వహణాధికారి ఎం.సుధాకర్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. వ్యవసాయం, వైద్యం, పశుసంవర్ధక, గృహ నిర్మాణ, ఐసీడీఎస్, విద్య, డ్వామా, డీఆర్‌డీఏ, పంచాయతీరాజ్, విద్యుత్, రహదారులు, ప్రణాళిక, పరిశ్రమలు, నీటిపారుదల, ఆర్టీసీ, పౌరసరఫరాలు, సంక్షేమశాఖల్లో జరుగుతున్న అభివృద్ధి పనులపై సమావేశంలో చర్చ జరుగుతుందన్నారు. ఆయా శాఖల అధికారులు నివేదికలతో హాజరు కావాలన్నారు. అలాగే జిల్లా పరిషత్ గౌరవ సభ్యులు హాజరు కావాలని కోరారు.

29న సాహితీ సదస్సు

కడప కల్చరల్ : నెలనెల రాయలసీమ సాహిత్యం కార్యక్రమంలో భాగంగా ఈనెల 29న సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో సాయంత్రం 5.00 గంటలకు 116వ సాహితీ సదస్సు నిర్వహించనున్నామని బ్రౌన్ గ్రంథాలయ సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో భాగంగా విశాఖపట్టణం విశ్రాంత రసాయనశాస్త్ర అధ్యాపకులు ఆచార్య కొత్తపల్లి గంగాధరవేణు తాను రాసిన నాటకాలపై ప్రసంగించనున్నట్లు వివరించారు.



పాఠశాలలో బోధిస్తున్న ఉపాధ్యాయుడు

ఇక బోధనే బాధ్యత

- బోధనేతర పనుల నుంచి ఉపాధ్యాయులకు విముక్తి
- హర్షం వ్యక్తం చేస్తున్న మేధావులు
- స్వాగతిస్తున్న ఉపాధ్యాయ వర్గాలు

జిల్లా సమాచారం

ప్రాథమిక పాఠశాలలు	:1,709
ప్రాథమికోన్నత పాఠశాలలు	:214
ఉన్నత పాఠశాలలు	:296
బాలురు	:85,032
బాలికలు	:85,216
ఉపాధ్యాయులు	:8,397

మదనపల్లె సిటీ : విద్యార్థుల అభ్యున్నతిలో ఉపాధ్యాయుల పాత్ర ఎనలేనిది. విద్యాబుద్ధులు నేర్పి వారిని ప్రయోజకులుగా తీర్చిదిద్దడంలో తల్లిదండ్రుల తర్వాత గురువుదే గురుతర బాధ్యత. అందుకే వారు 'ఆచార్య దేవోభవ' అని పూజింపబడుతున్నారు. కానీ గత పాలకులు విద్యారంగంపై చూపిన నిర్లక్ష్యం కారణంగా చదువులు చెప్పాల్సిన మాస్టరు బోధనేతర పనుల వైపు శ్రద్ధ పెట్టాల్సిన దుస్థితి ఏర్పడింది. ఇప్పుడు ఆ బోధనేతర పనులకు చమరగీతం పాడే రోజులు వచ్చాయి. తన నైపుణ్యాన్ని అంతా రంగరించి పిల్లలకు చక్కగా పాఠ్యాంశాలు బోధించి మా దేవుడు మీరే మాస్టారు అని పిలిపించుకునే తరుణం ఆసన్నమైంది.

ఇన్నాళ్లకు మోక్షం..

ఎన్నికల సమయంలో ఉపాధ్యాయులకు విధులు కేటాయించడంపై ఎప్పటి నుంచో ఉపాధ్యాయుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. ఈ బాధ్యతలను తప్పించాలని ఉపాధ్యాయ సంఘాల నుంచి డిమాండ్ ఉంది. కానీ నాటి పాలకులెవ్వరూ ఉపాధ్యాయుల గోడు వినలేదు. ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్‌మోహన్‌రెడ్డి నేతృత్వంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఇప్పుడు ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపునిస్తూ సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఉత్తర్వులు జారీ అయ్యాయి. దశాబ్దాల తరబడి ఉపాధ్యాయుల నుంచి వస్తున్న డిమాండ్‌కు ఇన్నాళ్లకు మోక్షం లభించింది. ఇకనుంచి టీచర్లు బడిలో పనులకే పరిమితం కావాల్సి ఉంటుంది. దీనిపై మేధావి వర్గం,ఉపాధ్యాయ సంఘాలు, ఉపాధ్యాయుల నుంచి హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

విద్యకు మంచి రోజులు



అందరికీ విద్యతోనే సమాజం అభివృద్ధి చెందుతుంది. విద్యార్థులను తీర్చిదిద్దడంలో ఉపాధ్యాయులే కీలకం. కానీ వారిని బోధనేతర పనులకు వినియోగిస్తుండటం వల్ల ఆశించిన ఫలితాలను రాబట్టలేని పరిస్థితులు ఉండేవి. ప్రభుత్వ ఉత్తర్వులతో ఇక ఉపాధ్యాయులంతా విద్యార్థులకు చక్కగా పాఠాలు చెప్పవచ్చు. – ప్రభాకర్‌రెడ్డి, ఎంఈఓ, మదనపల్లె.

మంచి నిర్ణయం



ప్రభుత్వం మంచి నిర్ణయం తీసుకుంది. బోధనేతర పనుల భారంతో స్కూల్లో విద్యార్థులకు చదువులు సవ్యంగా చెప్పలేకపోతున్నారు. ఉపాధ్యాయుల సమస్యలను గుర్తించిన ప్రభుత్వం సాహసోపేతమైన నిర్ణయం తీసుకుంది. దీని వల్ల ఉపాధ్యాయులకు ఎంతో ఉపశమనం కలిగినట్లే. ఇది అందరూ హర్షించాల్సిన గొప్ప నిర్ణయం. – జీవీ ప్రసాద్, వైఎస్సార్‌టీఎఫ్ వ్యవస్థాపక సభ్యుడు.

రాజంపేట టీడీపీలో వర్గపోరు

టికెట్ కోసం ఇద్దరునేతల మధ్య పోటీ

రాజంపేట : అన్నమయ్య జిల్లా రాజంపేట తెలుగుదేశం పార్టీలో వర్గపోరు ముదిరి పాకానపడింది. నియోజకవర్గ స్థాయిలో ఇద్దరి నేతల మధ్య టికెట్ కోసం అంతర్గతపోరు ఉధృతమైంది.మా నేతకే టికెట్ అని ఓ వర్గం, లేదు మానేతకే అంటూ మరో వర్గం చెప్పుకుంటోంది. దీంతో కార్యకర్తలు, నాయకులు దిక్కుతోచని స్థితిలో ఉన్నారు.ఇద్దరు నేతలు పార్టీ కార్యక్రమాలను వేర్వేరుగా నిర్వహించుకుంటూ వస్తున్నారు. రాజంపేట టీడీపీ కార్యాలయాలు వెలిశాయి. రాజంపేట, నందలూరు, ఒంటిమిట్ట, సిద్దవటం, వీరబల్లి, సుండుపల్లెలో మండలాల్లో రెండు వర్గాలుగా ఏర్పడ్డారు..

లోకేష్ పాదయాత్రను దృష్టిలో ఉంచుకొని టీడీపీ కార్యాలయంలో నియోజకవర్గస్థాయిలోని ముఖ్యనేతలు అదివారం సమావేశమయ్యారు. ఈ సమావేశంలో టికెట్ ఆశిస్తున్న నేత ఎదుట వర్గవిభేధాలు బట్టబయలయ్యాయి. తమ్ముళ్లు ఒకరిపై ఒకరు దుమ్మెత్తిపోసుకున్నారు.పట్టణానికి చెందిన యువనాయకుడు నేరుగా ఆరోపణలు చేశారు. బాబు సామాజికవర్గ నేత ఒకరు విరుచుకుపడ్డారు. దీంతో సమావేశం రసాభాసగా మారింది.

ఎన్నికలు దగ్గరపడుతున్న క్రమంలో ఇద్దరు నేతలు టికెట్ బరిలో నిలిచారు. ఎవరి స్థాయిలో వారు రాజకీయం చేస్తున్నారు. ఒకరు పాత..మరొకరు కొత్త అన్న రీతిలో టీడీపీ పాలిట్రిక్స్ కొనసాగుతున్నాయి. దీంతో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో రెండు వర్గాలుగా టీడీపీ శ్రేణులు నిట్టనిలువునా చీలిపోయాయి. లాభమనే సాకుతో కొందరు నాయకులు ఒక నేత గూటికి చేరిపోయారు. మరో నేత పార్టీలో ముందునుంచి కొనసాగుతున్నారు. ఆ నేత వెంట సామాజికవర్గానికి చెందిన నాయకులు కొనసాగుతున్నారు.

వేర్వేరుగా లోకేష్ జన్మదిన వేడుకలు

టీడీపీ జాతీయ ప్రధానకార్యదర్శి నారా లోకేష్ బర్త్‌డేకు వర్గసెగ తాకింది. సోమవారం నియోజకవర్గ కేంద్రంలో రాజు విద్యాసంస్థల అధినేత, టీడీపీ సీనియర్ నాయకుడు చమర్తి జగన్‌మోహన్‌రాజు తమ వర్గీయులతో తనకు సంబంధించిన టీడీపీ కార్యాలయంలో కేక్ కట్ చేశారు. అనంతరం వీరాంజనేయస్వామి ఆలయంలో 108 టెంకాయలుకొట్టి పూజలుచేశారు. టీడీపీ రాష్ట్ర ప్రధానకార్యదర్శి , రాజంపేట నియోజకవర్గ ఇన్‌చార్జి బత్యాల చెంగల్రాయుడు తనకు సంబంధించిన టీడీపీ కార్యాలయంలో లోకేష్ జన్మదిన వేడుకలను నిర్వహించారు. దీన్ని బట్టి చూస్తే మొన్న ఎన్టీఆర్ వర్ధంతి నేడు లోకేష్ జన్మదినం వేడుకలను టీడీపీ నాయకులు వేర్వేరుగా నిర్వహించడంతో రాజంపేట టీడీపీలో వర్గపోరు ఉధృతమవుతోందని చెప్పవచ్చు.

హార్సిలీహిల్స్‌పై లోకాయుక్త విచారణ

బి.కొత్తకోట : బి.కొత్తకోట మండలంలోని పర్యాటక కేంద్రం హార్సిలీహిల్స్‌పై హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి 1974లో ప్రభుత్వం విక్రయించిన భూముల ప్రస్తుత స్థితిగతులపై సమగ్ర విచారణకు లోకాయుక్త జస్టిస్ పి.లక్ష్మణరెడ్డి ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ వ్యవహారంపై విచారణ సాగుతుండగా సోమవారం లోకాయుక్త డిప్యూటీ డైరెక్టర్ (దర్యాప్తు) గంగరాజు క్షేత్రస్థాయిలో విచారణ ప్రారంభించారు. 1974 నవంబర్ 30 అప్పటి ప్రభుత్వం జీవో ద్వారా హార్సిలీహిల్స్ కోఆపరేటివ్ హౌస్ బిల్డింగ్ సొసైటీకి మార్కెట్ విలువకు 20.60 ఎకరాలను విక్రయించింది. 1979 నుంచి 1985 వరకు 60 మంది సభ్యులకు ప్లాట్లు కేటాయించగా ఇందులో బినామి పేర్లతో ప్లాట్లు కేటాయించినట్టు ఆరోపణలు వెలుగుచూశాయి. దీంతో 1991లో హార్సిలీహిల్స్‌ను సందర్శించిన ముఖ్యమంత్రి నేదురుమల్లి జనార్దన్‌రెడ్డికి కొందరు ఫిర్యాదు చేశారు. గతంలో పనిచేసిన సొసైటీకి చెందిన ఓ మాజీ చైర్మన్‌పై ఆరోపణలు వచ్చాయి. దీనిపై సహకార అధికారి డాక్టర్ పీఎస్‌వీ.రామాంజినేయులు దర్యాప్తులో అవినీతి, అక్రమాల ఆధారంగా కేసు నమోదుకు అప్పటి మదనపల్లె డివిజనల్ సహకార అధికారి లక్ష్మీ బి.కొత్తకోట పోలీసులకు ఫిర్యాదు చేశారు. కాగా సొసైటీ భూములపై లోకాయుక్తకు అందిన ఫిర్యాదుతో విచారణ మొదలైంది. డిప్యూటీ డైరెక్టర్ గంగరాజు విచారణ నిమిత్తం హార్సిలీహిల్స్ చేరుకొని సొసైటీ కొనుగోలు చేసిన భూముల స్థితిగతులను క్షుణ్ణంగా పరిశీలించారు. రెండు సర్వే నంబర్లలోని సొసైటీ భూములను పరిశీలించి కొన్ని అనుమానాలను లేవనెత్తారు. ఓ వాణిజ్య సముదాయం ఆధీనంలోని భూములు వాటి నిర్వాహకులకు ఎలా వచ్చాయి, సొసైటీ కేటాయించిందా, లేక ఆక్రమించారా అన్న సమగ్ర వివరాల నివేదిక ఇవ్వాలని తహసీల్దార్ ధనుంజయలును గంగరాజు ఆదేశించారు. రెవెన్యూ అధికారులు సీజ్‌చేసిన సొసైటీ భూములను తిరిగి ఎందుకు స్వాధీనం చేసుకోలేదని తహసీల్దార్‌ను ప్రశ్నించారు. దీనిపై రికార్డులు పరిశీలించి, ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లి నివేదిస్తామని తహసీల్దార్ విచారణ అధికారికి వివరణ ఇచ్చారు. సొసైటీ ప్రస్తుత భూములు పరిస్థితి గురించి డివిజనల్ కోఆపరేటివ్ అధికారి శ్యామ్‌ప్రకాష్‌రెడ్డిని కోరారు. సొసైటీ ప్రతినిధులు అందుబాటులో లేకపోవడంతో వారిని విచారించలేదని గంగరాజు చెప్పారు. ఈ విచారణ సమగ్రంగా సాగుతుందని తెలిపారు.

సూర్య, శేష వాహనాలపై దేవదేవుడు



గ్రామోత్సవంలో పెద్ద శేష వాహనంపై స్వామి, అమ్మవార్లు

కడప కల్చరల్ : దేవునికడప శ్రీ లక్ష్మి వెంకటేశ్వరస్వామి ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాల సందర్భంగా సోమవారం స్వామి ఉదయం సూర్యప్రభ, రాత్రి పెద్ద శేష వాహనంపై కొలువుదీరారు. ఉత్సవాలలో భాగంగా ఉదయం స్నపన తిరుమంజనం నిర్వహించగా, సాయంత్రం ఊంజల సేవ చేశారు. నాదస్వర విన్యాసాల మధ్య కళాకారుల భక్తికీర్తనలతో ఊంజల సేవ ఉల్లాసంగా సాగింది. ఉదయం అలంకరించిన సూర్యప్రభ వాహనంపై స్వామి సూర్యనారాయణమూర్తి అలంకారంలో గ్రామోత్సవానికి తరలి వెళ్లారు. రాత్రి పెద్ద శేషవాహనంపై భక్తుల జయజయధ్వానాల మధ్య మాడవీధుల్లో దర్శనమిచ్చారు. స్థానిక భక్తులు పెద్ద సంఖ్యలో స్వామిని దర్శించుకుని పూజలు నిర్వహించారు. అర్చకులు వారికి మంగళ హారతులు, తీర్థ ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలో టీటీడీ కళాకారుల అన్నమాచార్య కీర్తనలు, ధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో హరికథగానం భక్తులను అలరించింది.

విశ్వవిద్యాలయ ప్రగతికి కృషి

– వైఎస్‌ఆర్ ఏఎఫ్‌యూ ఇన్‌చార్జి వీసీ ఆచార్య పి. ఫజుల్ రెహమాన్

ఏఎఫ్‌యూ : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన డాక్టర్ వైఎస్‌ఆర్ ఆర్కిటెక్చర్ అండ్ ఫైన్‌ఆర్ట్స్ విశ్వవిద్యాలయం అభివృద్ధికి కృషిచేస్తానని వైస్ చాన్సలర్ ఆచార్య పి. ఫజుల్ రెహమాన్ పేర్కొన్నారు. పూర్తిస్థాయి అదనపు బాధ్యతలతో (ఎఫ్ఏసీ) వైస్ చాన్సలర్‌గా నియమితులైన ఈయన ఈనెల 11న ఏపీ ఉన్నతవిద్యామండలిలో చార్జి తీసుకున్నప్పటికీ లాంఛనంగా సోమవారం విశ్వవిద్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ విశ్వవిద్యాలయానికి సంబంధించిన అన్ని అంశాలను పరిశీలించానన్నారు. విశ్వవిద్యాలయం భూమి కేటాయింపులు, నిర్మాణపనులు, మౌలిక వసతుల కల్పనపై దృష్టి సారిస్తామన్నారు.

శుభాకాంక్షల వెల్లువ

ఆచార్య పఠాన్ ఫజుల్ రెహమాన్‌కు విశ్వవిద్యాలయ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.సి. సురేంద్రనాథ్‌రెడ్డి స్వాగతం పలికారు. అనంతరం ఆయన దివంగత ముఖ్యమంత్రి వైఎస్‌ఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కర్నూలు డాక్టర్ అబ్దుల్ హక్ విశ్వవిద్యాలయం రిజిస్ట్రార్ ఆచార్య బాయినేని శ్రీనివాస్, వైవీయూ రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్య, వైవీయూ పరీక్షల నియంత్రణాధికారి ఆచార్య ఎన్. ఈశ్వరరెడ్డి తదితరులు శుభాకాంక్షలు తెలిపి వీసీ దంపతులను సత్కరించారు.

మెరుగైన వైద్యం అందించడమే లక్ష్యం

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటిటౌన్ : పేదలకు మెరుగైన వైద్యం అందించాలన్నదే ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి లక్ష్యమని ఎమ్మెల్యే శ్రీకాంత్ రెడ్డి అన్నారు. సోమవారం జిల్లా కలెక్టర్ గిరీషాతో కలసి పేదల సంక్షేమం-ఆరోగ్యంలో భాగంగా డాక్టర్ వైఎస్సార్ అర్బన్ ప్రైమరీ హెల్త్ సెంటర్‌లను ప్రారంభించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ఈ ఆస్పత్రులు అధునాత హంగులతో రూపు దిద్దుకున్నాయన్నారు. కొత్త టెక్నాలజీతో కూడిన ల్యాబొరేటరీలు ఉన్నాయని చెప్పారు.రాయచోటి కేంద్రంలోని బండ్లపెంట, కొత్తపేట రామాపురం,చిత్తూరు రోడ్డులోని ఫయాజ్ ఫంక్షన్ హాల్ సమీపంలో మరొకటి ప్రారంభించారు. మున్సిపల్ చైర్మన్ ఫయాజ్ బాషా, వైస్సార్ సీపీ మదనపల్లె పరిశీలకులు హబీబ్‌ఖాన్, జెడ్పీటీసీ వెంకటేశ్వర్లురెడ్డి, మార్కెట్ కమిటీ అధ్యక్షుడు వెంకటేశ్వర్లు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చెన్నూరు అన్వర్‌బాషా, వైఎస్సార్‌సీపీ నాయకులు బేపారీ మహమ్మద్‌ఖాన్ పాల్గొన్నారు.

ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ నిర్మాణాల పరిశీలన

పట్టణంలోని తిరుపతి నాయుడు కాలనీలోని ట్రాఫిక్ పోలీస్ స్టేషన్ నిర్మాణాలను జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి పరిశీలించారు. కాంట్రాక్టర్‌తో మాట్లాడారు. త్వరగా పనులు పూర్తి చేయాలని సూచించారు. అనంతరం కొత్తపేట రామాపురంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిర్మాణంలో ఉన్న అదనపు గదుల పనులు పరిశీలించారు. కార్యక్రమంలో వైఎస్ చైర్మన్ ఫయాజుర్ రహిమాన్, మున్సిపల్ కమిషనర్ రాంబాబు, డీఎంహెచ్‌వో కొండయ్య పాల్గొన్నారు.



డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య కేంద్రాలను ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ గిరీషా, ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రీ-సర్వే నిర్వహణపై దృష్టి సారించాలి

జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్



రాయచోటి : జగనన్న శాశ్వత భూ హక్కు, భూ రక్ష పథకం రీసర్వే కార్యక్రమ నిర్వహణపై ప్రత్యేక దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సంబంధిత అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్ నుంచి జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్, రీ సర్వే, స్పందన అర్జీలు గడప గడపకు మన ప్రభుత్వం, సచివాలయ సిబ్బంది బయో మెట్రిక్ అటెండెన్సు, ఆయుష్మాన్ భారత్ తదితర అంశాలపై మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలు, తహసీల్దార్లతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్షించారు. ఈ కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్ అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ, ల్యాండ్ అండ్ సర్వే ఏడీ జయరాజ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ మాట్లాడుతూ రీ-సర్వే కార్యక్రమాన్ని నిర్దేశించిన గడువులోగా పూర్తి చేయాలన్నారు. ఈ పనులను ఆర్డీఓలు, తహసీల్దార్లు పర్యవేక్షిస్తూ ఉండాలన్నారు. అలాగే స్పందన అర్జీలను పెండింగ్‌లో ఉండకుండా గడువులోగా పరిష్కరించాలన్నారు. యుద్ధ ప్రాతిపదికన ఆయుష్మాన్ భారత్ ఈకేవైసీ పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీఓలను ఆదేశించారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో మంజూరైన పనులన్నీ ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలన్నారు. పేదల వివాహాలకు ప్రభుత్వం అందిస్తున్న వైఎస్సార్ కల్యాణమస్తు, వైఎస్సార్ షాదీ తోఫా కార్యక్రమాలపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. వైఎస్సార్ కల్యాణమస్తుపై వలంటీర్ల ద్వారా తెలియజేసి దరఖాస్తులు ఆహ్వానించాలన్నారు. ఎస్సీ, ఎస్టీ కాలనీలలో శ్మశాన వాటికలకు స్థలాలు గుర్తించాలన్నారు.

స్పందన అర్జీలపై నిర్లక్ష్యం వద్దు

స్పందన అర్జీలను అధికారులు నిర్లక్ష్యం చేయకుండా గడువులోగా పరిష్కరించి బాధితులకు న్యాయం చేయాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ సూచించారు. సోమవారం కలెక్టరేట్‌లోని స్పందన హాల్‌లో ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో జాయింట్ కలెక్టర్ తమీమ్‌అన్సారియా, డీఆర్‌ఓ సత్యనారాయణ ప్రజల నుంచి వచ్చిన అర్జీలను స్వీకరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రతి సోమవారం స్పందన కార్యక్రమంలో వచ్చిన అర్జీలను శనివారం లోపల క్లియర్ అయ్యేలా చూడాలన్నారు.

'స్పందన'కు వచ్చిన అర్జీలు

- రాయచోటి మండలం రాంనగర్‌కు చెందిన ఎస్.జాకీర్‌హుస్సేన్ తనకు వికలాంగుల పింఛన్ మంజూరు చేయించాలని జిల్లా కలెక్టర్‌కు అర్జీ సమర్పించారు.
- రైల్వేకోడూరు మండలానికి చెందిన పి.హరిప్రసాద్ తనకు వృద్ధాప్య పెన్షన్ మంజూరు చేయాలని అర్జీ ఇచ్చారు.
- రాయచోటి మండలం హబీబాబాద్‌వీధికి చెందిన ఎస్.గౌస్‌మొహిద్దీన్ సర్వే నెంబర్ 804లో 3 ఎకరాల భూమి ఇతరులు ఆక్రమించుకున్నారని విచారణ జరిపి న్యాయం చేయాలని విన్నవించారు.
- రాయచోటి మండలం మాసాపేటకు చెందిన పి.స్వర్ణలత ఐదేళ్ల క్రితం తన భర్త మరణించాడని, నా భర్త పేరు మీద ఉన్న 5 ఎకరాల భూమి తన పేరు మీద ఆన్‌లైన్ చేయించాలని విన్నవించారు.

ఎత్తివేత.. వ్యతిరేకత

- వివాదంలో రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్ తరలింపు ప్రక్రియ
- మార్చి చివరి నాటికి పూర్తిస్థాయిలో మూసివేత
- రైల్వే కార్మికుల్లో వ్యతిరేకత



నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్



నందలూరు రైల్వేకు జరుగుతున్న అన్యాయంపై ఎంపీ మిథున్‌రెడ్డికి వినతి పత్రం ఇస్తున్న ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి తదితరులు (ఫైల్)

నందలూరు(రాజంపేట) : రైల్వేపరంగా బ్రిటిష రైల్వేపాలకుల హయాంలో వెలుగొందిన నందలూరు రైల్వేకేంద్రంలోని సమగ్ర కంప్యూటరైజ్డ్ క్రూ బుకింగ్ లాబీ(రన్నింగ్‌స్టాఫ్ క్రూసెంటర్) తరలింపు ప్రక్రియ వివాదస్పదమైంది. తరలింపునకు సంబంధించి ఆదేశాలు జారీ అయ్యాయి. రన్నింగ్‌స్టాఫ్ సిబ్బందికి ఎర్రగుంట్ల-నంద్యాల సెక్షన్‌లో ఎల్ఆర్ఎస్(లర్నింగ్ రోడ్ సెక్షన్) ఇస్తున్నారు. ఇందులో నందలూరు క్రూసెంటర్ పరిధిలో వీరు ఉన్నారు. .

బ్రిటిష్ రైల్వేపాలకుల నుంచి

బ్రిటిష్ రైల్వేపాలకుల నుంచి వేలాది మంది కార్మికులు, ఉద్యోగులతో నందలూరు రైల్వేకేంద్రం కళకళలాడింది.ఇప్పుడు రోజురోజుకు అన్నిశాఖలను ఎత్తివేస్తూ రైల్వేశాఖ నిర్ణయాలు తీసుకుంటోంది. స్వాతంత్ర్యం రాకముందు నుంచి ఉన్న స్టీమ్ ఇంజిన్ లోకోషెడ్ ఏర్పాటు కావడంతో అనుబంధంగా రైల్వేకు సంబంధించి అన్ని విభాగాలు ఏర్పడ్డాయి.అప్పట్లో అరకోణం(సదరన్‌రైల్వే) నుంచి గుంతకల్ (ఎస్సీరైల్వే) వరకు నందలూరే రైల్వేపరంగా కీలక కేంద్రంగా కొనసాగింది. లోకోషెడ్ ఎత్తివేయడంతో పాటు అన్ని శాఖలను లేకుండా చేశారు.

రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ తరలింపుపై రైల్వేకార్మికుల్లో వ్యతిరేకత వెల్లుబకుతోంది.ఎర్రగుంట్లలో పనిచేయడానికి ఎవరూ ఇష్టపడటం లేదు. నాలుగు లైన్లు ఉండటం, కాలుష్యం సమస్యలను రన్నింగ్‌స్టాఫ్ ఎత్తిచూపుతున్నారు. గతంలో ముద్దనూరులో కూడా ఇదే విధంగా క్రూసెంటర్ పెట్టాలనే ప్రయత్నాన్ని కార్మిక సంఘాలు అడ్డుకున్నాయి. ఇప్పుడూ అదే పరిస్థితులకు దారితీస్తోంది.

మార్చి నెలాఖరులోగా పూర్తిస్థాయిలో క్రూ సెంటర్ తరలింపు పూర్తికావాలని ఆదేశాలు జారీ అయ్యాయి. అదే విధంగా ఈనెలాఖరు లోపు నందలూరు క్రూ సెంటర్‌కు సంబంధించిన రన్నింగ్‌స్టాఫ్‌కు ఎల్ఆర్ఎస్ పూర్తి చేయాలన్నారు.దీంతో వారిలో ఆందోళన నెలకొంది.

తరలింపు వద్దంటూ జీఎంను కోరిన ఎంపీ మిథున్‌రెడ్డి

నందలూరు రైల్వేపరంగా ప్రాముఖ్యత కలిగిన కేంద్రమని, ఇక్కడ ఉన్న నందలూరు రన్నింగ్‌స్టాఫ్ క్రూను ఎత్తివేసే నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని దక్షిణమధ్యరైల్వే జనరల్ మేనేజరు ఏకేజైన్‌ను రాజంపేట ఎంపీ మిథున్‌రెడ్డి కోరారు. నందలూరు. రాజంపేటలో రైళ్లస్టాపింగ్ అంశాలను కూడా ఆయన ప్రస్తావించారు.ఎంపీ మిథున్‌రెడ్డి ఇటీవల రాజంపేటకు వచ్చిన సందర్భంగా ఎమ్మెల్యే మేడామల్లికార్జునరెడ్డి ఆధ్వర్యంలో ఎంపీపీ మేడా విజయభాస్కర్‌రెడ్డి నేతృత్వంలో నందలూరు రైల్వేకు జరుగుతున్న అన్యాయాన్ని వివరించారు.

రన్నింగ్‌స్టాఫ్ క్రూ తరలిస్తే నందలూరు నిర్మానుష్యమే



నందలూరు రైల్వేకేంద్రానికి గుండెకాయ లాంటిది రన్నింగ్‌స్టాఫ్ క్రూ. క్రూసెంటర్‌ను తరలిస్తే రైల్వేపరంగా నందలూరు నిర్మానుష్యమే. ఇప్పటికే రైల్వే విభాగాలను ఒక్కొక్కటిగా తరిలించుకుపోతున్నారు. అడ్డుకట్టవేసేదెవరు అనేది ప్రశ్నార్థకంగా మారింది. మా నాన్న రైల్వే డ్రైవర్, ఆవిధంగా రైల్వేతో తమ జీవితాలు ముడిపడ్డాయి. – షమీవుల్లాఖాన్, ఏజీపీ, నందలూరు

ప్రాభవం కోల్పోయినట్లే..



రన్నింగ్‌స్టాఫ్ క్రూ సెంటర్ తరలిస్తే రైల్వేపరంగా నందలూరు రైల్వేకేంద్రం ప్రాభవం పూర్తిగా కోల్పోయినట్లే. తరలింపు ప్రక్రియను విరమించుకోవడం మంచిది ఎంపీ మిథున్‌రెడ్డి నందలూరు రైల్వే అభివృద్ధికి సంబంధించి అనేక సార్లు ఎంఆర్(మినిస్టర్ ఆఫ్ రైల్వేస్), రైల్వే ఉన్నతాధికారులకు దృష్టికి తీసుకెళ్లారు. – అర్ముగం విశ్వనాథ్, ఐకేపీఎస్ నేత, నందలూరు

రైల్వేమంత్రిత్వశాఖ, రైల్వేబోర్డును కలిసేందుకు ఎమ్మెల్యే నేతృత్వంలో ఢిల్లీకి రావాలని ఎంపీ తెలిపినట్లు జిల్లా వక్ఫ్‌బోర్డు జనరల్‌సెక్రటరీ సయ్యద్‌అమీర్ తెలిపారు.

క్లుప్తంగా

సకాలంలో లక్ష్యం పూర్తి చేయాలి



ఉపాధి పనులను పరిశీలిస్తున్న ఉపాధి పీడీ మద్దిలేటి

రామాపురం : జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకంలో కూలీలకు సకాలంలో పనులు కల్పించాలని అన్నమయ్య జిల్లా ఉపాధి హామీ పథకం పీడీ మద్దిలేటి అన్నారు. మండలంలోని నల్లగుట్ట పల్లె పంచాయతీ బీసీ కాలనీ సమీపంలో ఉపాధి ద్వారా చేపడుతున్న కాలువ పనులను సోమవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రోజుకు రూ.257 వచ్చే విధంగా పని కల్పించాలని తెలిపారు. రోజుకు 4 గంటల పాటు పనులు చేసే విధంగా చూడాలన్నారు. ఉపాధి పనుల్లో నాణ్యత పెంచాలన్నారు. కార్యక్రమంలో టీఏ సురేంద్రనాయుడు, ఫీల్డ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శతాధిక వృద్ధురాలు మృతి



మహబూబ్‌బీ (ఫైల్)

రామసముద్రం : రామసముద్రం మండలం పెద్దకురప్పల్లె పంచాయతీ తిరుమలరెడ్డి పల్లెలోని 103 ఏళ్ల శతాధిక వృద్ధురాలు మహబూబ్‌బీ అనారోగ్యంతో సోమవారం మృతి చెందింది. ఈ వృద్ధురాలకు మొత్తం 12 మంది సంతానం. మృతురాలికి కుమారులు, కుమార్తెలు, వారి కుమారులు, కుమార్తెలు, మనవళ్లు, మనమరాళ్లు, ముని మనవళ్లు, వారి సంతానం మొత్తం కలిపి సుమారు 200 మంది వరకు ఉన్నారు. తిరుమలరెడ్డిపల్లె గ్రామంలో ఒక వీధి మొత్తం ఈమె వారసులే ఉన్నారు. 103 ఏళ్ల పాటు ఎంతో ఆరోగ్యంగా జీవించిన ఆమె చనిపోయే వరకు వ్యవసాయం, ఇంటి పనుల్లో చురుగ్గా ఉండేది.

నిరుద్యోగులకు శిక్షణ.. ఉద్యోగ కల్పన

- తరగతి గది నుంచి నేరుగా కార్పొరేట్ కంపెనీకి
- పరిశ్రమల అవసరాలే బోధనాంశాలు
- స్కిల్‌డెవలప్‌మెంట్ ఆధ్వర్యంలో ఉపాధి అవకాశాలు
- మదనపల్లె జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో రెండో విడత శిక్షణ ప్రారంభం



స్కిల్‌హబ్‌లో నిరుద్యోగులకు శిక్షణ



జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల

మదనపల్లె : గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లోని నిరుద్యోగ యువతకు ఉపాధి కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకుంటోంది. చాలా మంది పదో తరగతి, ఇంటర్మీడియెట్, ఐటీఐ, పాలిటెక్నిక్ డిప్లమా, గ్రాడ్యుయేషన్, పోస్ట్‌గ్రాడ్యుయేషన్ తదితర కోర్సులు పూర్తి చేస్తున్నారు. అయితే నైపుణ్యం లేకపోవడంతో విద్యార్హతలు ఉన్నప్పటికీ ఉద్యోగ, ఉపాధి అవకాశాలు అందుకోలేకపోతున్నారు. ఈ నేపథ్యంలో విద్యలో నైపుణ్యాలు, పారిశ్రామిక అవసరాలకు అనుగుణంగా స్కిల్ డెవలప్‌మెంట్‌పై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించింది. అందులో భాగంగా రాష్ట్ర ప్రభుత్వం స్కిల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో నిరుద్యోగ యువతి, యువకులకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేందుకు స్కిల్‌హబ్‌లను ఏర్పాటు చేసింది. చదువుతున్న విద్యార్థులకు ఎంప్లాయిబిలిటి స్కిల్ సెంటర్‌ని డిగ్రీ కళాశాలల్లో ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తున్నారు. తర్వాత జాబ్‌మేళాలు ఏర్పాటు చేసి యువతకు ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నారు.

జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్‌హబ్

రాష్ట్రంలోని ప్రతి నియోజకవర్గంలో స్కిల్ హబ్ ఏర్పాటు చేసి స్థానికంగా ఉన్న పరిశ్రమల డిమాండ్ మేరకు వివిధ కోర్సులను ఎంపిక చేసి.. నిరుద్యోగ యువతకు శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించేలా ప్రభుత్వం ముందుకెళుతోంది. శిక్షణ తరగతి గది నుంచి నేరుగా ఉద్యోగంలోకి వెళ్లేందుకు అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటోంది.

అన్నమయ్య జిల్లా మదనపల్లెలోని జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్ సెంటర్‌లో తొలిసారిగా 'జూనియర్ సాఫ్ట్‌వేర్ డెవలపర్' కోర్సును ఎంపిక చేసి శిక్షణ ఇస్తున్నారు. శిక్షణ పూర్తయిన తర్వాత వీరికి ఇంటర్వ్యూలు నిర్వహించి ఉపాధి అవకాశాలు కల్పిస్తారు. మొదటి కోర్సు తుది దశకు చేరుకుంటున్నందున రెండోకోర్సు కింద 'డొమెస్టిక్ డేటా ఎంట్రీ ఆపరేటర్' సోమవారం నుంచి శిక్షణ తరగతులను ప్రారంభించారు. ఇంటర్, ఆపై విద్యార్హత కలిగి ఉన్న నిరుద్యోగులు దీనికి అర్హులు. ఇప్పటికే దీనికి సంబంధించి రిజిస్ట్రేషన్ ప్రక్రియను ప్రారంభించారు. కోర్సు నేర్చుకోవాలని ఆసక్తి ఉన్న అభ్యర్థులు నేరుగా జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాలలో స్కిల్‌హబ్ ప్రతినిధులను సంప్రదించవచ్చు.

శిక్షణను సద్వినియోగం చేసుకోవాలి



రాష్ట్ర ప్రభుత్వం ఏపీఎస్ఎస్‌డీసీ ద్వారా నిరుద్యోగులకు వివిధ కోర్సులలో శిక్షణ ఇచ్చి ఉపాధి కల్పించడం జరుగుతోంది. దానితోపాటు ప్రతినెలా జాబ్‌మేళాలు నిర్వహించి ఉద్యోగాలు కల్పిస్తున్నాం. జిల్లాలోని స్కిల్‌హబ్‌ల ద్వారా ఇస్తున్న శిక్షణలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలి.

\- బి.హరికృష్ణ, జిల్లా నైపుణ్యాధికారి, అన్నమయ్య జిల్లా

నైపుణ్యాలతోనే ఉద్యోగం



ప్రస్తుత కాలంలో ఉద్యోగాలు పొందాలంటే విద్యార్హతలతోపాటుగా నైపుణ్యాలు నేర్చుకోవడం తప్పనిసరిగా మారింది. ప్రతి వ్యక్తి నైపుణ్యాలను పెంచుకుని ఉద్యోగం పొందాలనే ముఖ్య ఉద్దేశంతో ప్రభుత్వం స్కిల్ హబ్‌లను ఏర్పాటు చేయడం అభినందనీయం. నిరుద్యోగులు వీటిని ఉపయోగించుకుని ఉపాధి పొందవచ్చు.

\- ఈఎంసీ ఆంజనేయులు, ప్రిన్సిపాల్, జీఎంఆర్ పాలిటెక్నిక్ కళాశాల

పరిశ్రమలకు అనుగుణంగా కోర్సులు



స్థానికంగా ఉన్న పరిశ్రమల్లో ఉపాధి కల్పించేందుకు వారి అవసరాలకు తగిన విధంగా స్కిల్ హబ్ ఆధ్వర్యంలో కోర్సులను రూపొందించి నిరుద్యోగులకు శిక్షణ ఇవ్వడం జరుగుతోంది. నైపుణ్యాలలో వెనుకబడిన నిరుద్యోగులను గుర్తించి, వారిలో సామర్థ్యం పెంచి ఉపాధి పొందేందుకు ఏర్పాటు చేసిన స్కిల్‌హబ్‌లను వినియోగించుకోవాలి.

\- పి.నవీన్‌కుమార్, స్కిల్‌హబ్ ఇన్‌చార్జి, మదనపల్లె

చెకుముకి రాష్ట్ర విజేతలు వీరే



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న అతిథులు, జేవీవీ నాయకులు

కడప కల్చరల్ : జన విజ్ఞాన వేదిక నిర్వహించిన చెకుముకి రాష్ట్ర స్థాయి పోటీలలో విజేతలను నిర్వాహకులు సోమవారం ప్రకటించారు. కడప నగరంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు నిర్వహించారు. ఇందులో పల్నాడు జిల్లా గణపవరం జెడ్పీ హైస్కూలు విద్యార్థులు పి.నాగయశ్విత, వి.కార్తీక్‌రెడ్డి, సీహెచ్ సాత్విక ప్రథమ స్థానం సాధించారు. చిత్తూరు జిల్లా గొనుగూరు జెడ్పీ హైస్కూలు విద్యార్థులు బి.సౌమ్య, డీఎల్ చైతన్యకుమార్, ఎస్.ప్రణీత ద్వితీయ స్థానం కైవసం చేసుకున్నారు. నెల్లూరు జిల్లా కేఎస్ఆర్ఎం హైస్కూలు విద్యార్థులు పి.అబ్దులామ్, ఎస్.హంసిని, ఎస్.ప్రద్యుస్‌రాజ్ తృతీయ స్థానంలో నిలిచారు. ప్రైవేటు పాఠశాలల విభాగంలో అనంతపురం జిల్లా లక్ష్మి సైనెరజ్ స్కూలు విద్యార్థులు సాయిగణేష్, నవదీప్ గణేష్, సాయి శ్రావణి ప్రథమ స్థానంలో, కాకినాడ ఆదిత్య టాలెంట్ స్కూలుకు చెందిన అశోక్‌స్వామి, శ్రీజన్, ఆదిత్య సాత్విక్ ద్వితీయ స్థానంలో, శ్రీ సత్యసాయిజిల్లా వాల్మీకి హైస్కూలు విద్యార్థులు ఓం.కిరణ్, శ్రీధర్, వజ్రేశ్వర్ తృతీయ విజేతలకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ సంబరాల ప్రధాన కార్యదర్శి వెంకట సుబ్బయ్య, ముఖ్య అతిథిగా మాజీ ఎమ్మెల్సీ గేయానంద్, మాజీ ప్రొఫెసర్ కోయ వెంకటేశ్వర్లు, కందుల విద్యాసంస్థల అధినేత చంద్ర ఓబుల్‌రెడ్డి, జేవీవీ రాష్ట్ర అధ్యక్ష, కార్యదర్శులు పాల్గొన్నారు.

వ్యభిచారం కేసులో అరెస్ట్

కడప అర్బన్ : కడప నగరం తాలూకా పోలీస్ స్టేషన్ పరిధిలోని బిల్టప్ సర్కిల్ సమీపంలో ఓ ఇంటిలో వ్యభిచారం నిర్వహిస్తున్న ముగ్గురిని సోమవారం అరెస్ట్ చేసినట్లు సీఐ ఉలసయ్య తెలియజేశారు. ఈ సంఘటనలో నరసింహ, రామాంజి, సుధాకర్‌లను అరెస్ట్ చేశారు.

గ్రీవెన్స్‌సెల్ అర్జీదారులకు కొనసాగిన అన్నదానం



అర్జీదారులకు స్వయంగా భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి

రాయచోటి అర్బన్ : సమస్యల పరిష్కారం కోసం కలెక్టరేట్‌కు వచ్చే అర్జీదారులకు ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి ఆధ్వర్యంలో చేపడుతున్న అన్నదాన కార్యక్రమం ఏడవ వారం కూడా కొనసాగింది. వైఎస్ఆర్‌సీపీ నేతల ఆర్థిక సౌజన్యంతో అన్నదానం కొనసాగుతున్న విషయం తెలిసిందే. సోమవారం వైఎస్ఆర్‌సీపీ మైనార్టీ యువనేత మహమ్మద్‌ఖాన్ ఆర్థిక సౌజన్యంతో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఎమ్మెల్యే శ్రీకాంత్‌రెడ్డి స్వయంగా అర్జీదారులకు భోజనం వడ్డించడంతోపాటు తాను కూడా తిన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుదూర ప్రాంతాల నుంచి న్యాయం కోసం జిల్లా కలెక్టర్, ఎస్పీలను కలిసేందుకు వచ్చే అర్జీదారుల ఆకలి తీర్చేందుకే ప్రత్యేకంగా ప్రతి సోమవారం అన్నదానం చేస్తున్నట్లు చెప్పారు. అర్జీదారులు అన్నదానం కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోవాలంటూ కోరారు. కార్యక్రమంలో మాజీ డీసీఎంఎస్ అధ్యక్షుడు ఆవుల విష్ణువర్ధన్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్‌లు చిల్లీస్ ఫయాజ్‌బాషా, ఫయాజుర్ రహిమాన్, మాజీ ఎంపీపీ పోలుసుబ్బారెడ్డి, సర్పంచుల సంఘం జిల్లా నేత చిదంబరరెడ్డి, మాజీ కౌన్సిలర్‌లు ఆనందరెడ్డి, వైఎస్ఆర్‌సీపీ నేతలు కొత్తపల్లె ఇంతియాజ్, ఖదీర్ తదితరులు పాల్గొన్నారు.

మదనపల్లెలో జీఆర్‌టీ జ్యువెలర్స్ ప్రారంభం



జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం

కడప కార్పొరేషన్ : మదనపల్లెలో సోమవారం జీఆర్‌టీ జ్యువెలర్స్ షోరూం ప్రారంభించారు. ఈ సందర్భంగా మేనేజింగ్ డైరెక్టర్లు జీఆర్ ఆనంద్, జీఆర్ రాధాక్రిష్ణన్ మాట్లాడుతూ బంగారం, వజ్రాలు, ప్లాటినం, వెండి, రత్నాలతో తయారు చేసిన ఆభరణాలను నాణ్యతగా, స్వచ్ఛంగా ఇవ్వడంలో వినియోగదారుల మన్ననలు పొందిన జీఆర్‌టీ జ్యువెలర్స్ మదనపల్లెలో అతిపెద్ద షోరూం ప్రారంభించిందని పేర్కొన్నారు. ప్రారంభోత్సవం సందర్భంగా బంగారు ఆభరణాల కొనుగోలుపై రూ.50 తగ్గింపు, పాత బంగారం మార్పిడిపై గ్రాముకు అదనంగా రూ.50 ఎక్కువ, వజ్రాలు, అన్‌కట్ డైమండ్ విలువ మీద 10 శాతం తగ్గింపు, వెండి వస్తువుల మీద మేకింగ్ చార్జీల్లో 25 శాతం తగ్గింపు, వెండి ఆభరణాల ఎంఆర్‌పీ మీద 10 శాతం తగ్గింపు ఇస్తున్నామన్నారు. ఈ పథకాలు ఒక నెల రోజులపాటు కొనసాగుతున్నాయన్నారు. మదనపల్లెలో వినియోగదారులకు మరింత దగ్గర కావడానికి ప్రత్యేకంగా రూపొందించిన డిజైన్లు, కలెక్షన్లతో స్వచ్ఛత, నైపుణ్యం కలిగిన కొత్త ప్రపంచాన్ని పరిచయం చేయడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో షోరూం సిబ్బంది పాల్గొన్నారు.

ఆధార్ లింక్ పేరుతో రూ.3.05 లక్షలు మాయం

బి.కొత్తకోట : 'మీ బ్యాంకు ఖాతాకు ఆధార్ లింక్ కాలేదు.. మేం పంపిన లింక్ ఓపెన్ చేయాలి' అని ఫోన్ చేసి కోరిన అపరిచిత వ్యక్తి ఓ మహిళ బ్యాంకు ఖాతాలోని రూ.3.05 లక్షలు దోచుకొన్న సంఘటన శనివారం జరిగిందని స్థానిక ఎస్ఐ కె.రామమోహన్ సోమవారం మీడియాకు తెలిపారు. ఆయన తెలిపిన మేరకు వివరాలు.. స్థానిక రంగసముద్రం రోడ్డుకు చెందిన కృషిత ఫోన్ నంబర్‌కు శనివారం ఓ అపరిచిత వ్యక్తి ఫోన్ చేశాడు. మీ ఎస్‌బీఐ ఖాతాకు ఆధార్ నంబర్ లింక్ కాలేదని చెప్పి నమ్మించాడు. మేం పంపిన లింక్‌ను తెరవాలని కోరగా కృషిత ఆ అనుమానాస్పద లింకును క్లిక్ చేసి తెరవగానే.. ఆ అపరిచిత వ్యక్తి ఫోన్ నంబర్‌కు ఓటీపీ వచ్చింది నంబర్ చెప్పమని కోరడంతో.. ఆ నంబర్ చెప్పగానే ఆమె ఖాతాలోని రూ.2.80లక్షలు ఫోన్ చేసిన వ్యక్తి క్రెడిట్ కార్డుకు జమ అయ్యింది. తర్వాత మళ్లీ ఫోన్ చేసి ఆధార్ లింక్ కాలేదని, మళ్లీ లింకు పంపాడు. ఆ లింకును ఓపెన్ చేయగానే ఖాతాలోని మరో రూ.25 వేలు మళ్లించుకొన్నాడు. కొద్దిసేపటికి మోసపోయినట్లు గుర్తించిన కృషిత పోలీసులను ఆశ్రయించింది. తక్షణమే స్పందించి 1930కు కాల్ చేసి ఈ మోసం గురించి చెప్పడంతో రూ.25 వేల నగదును ఫ్రీజ్ చేయించడం జరిగిందని ఎస్ఐ చెప్పారు. దీనిపై ఫిర్యాదు మేరకు ఐటీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు. ఖాతాదారులు అపరిచిత వ్యక్తులు ఫోన్ చేసి మోసాలకు పాల్పడుతున్నారని, అప్రమత్తంగా ఉండాలని ప్రజలను కోరారు. ఏదైనా అనుమానం ఉంటే బ్యాంకుల అధికారులను సంప్రదించాలని సూచించారు.

క్రీడాభివృద్ధికి ప్రభుత్వం పెద్ద పీట



మాట్లాడుతున్న భానుమూర్తిరాజు

మదనపల్లె సిటీ: క్రీడాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందని రీజనల్ ఫిజికల్ ఎడ్యుకేషన్ అధికారి భానుమూర్తి అన్నారు. సోమవారం స్థానిక జీఆర్టీ ఉన్నత పాఠశాలలో 66వ స్కూల్‌గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో అండర్–17 బాల, బాలికల అంతర్ జిల్లా స్థాయి బాల్ బాడ్మింటన్ పోటీలు, ఎంపికలు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ విద్యార్థులు క్రీడలతో పాటు చదువులో రాణించాలన్నారు. డీవైఈఓ క్రిష్ణప్ప మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడలకు అధిక ప్రాధాన్యత కల్పిస్తున్నట్లు తెలిపారు. ప్రభుత్వ పాఠశాలల్లో క్రీడాకారులు జాతీయ, రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికైనట్లు తెలిపారు.

మధ్యాహ్న భోజనంలో తేలు

ఇద్దరు సిబ్బందికి మెమోలు జారీ చేసిన డీఈఓ

వీరబల్లి : మండల పరిధి మట్లి పెద్దూరు కస్పాలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో సోమవారం మధ్యాహ్నం భోజనంలోని ఎగ్ కర్రీలో తేలు కనిపించింది. భోజనం వడ్డిస్తుండగా ఎగ్ కర్రీలో ఉన్న తేలును గమనించిన విద్యార్థులు వెంటనే అక్కడే పారవేశారు. కొందరు విద్యార్థులు అప్పటికే భోజనం తినడంతో ఏమైనా ప్రమాదం ఉందేమోనని వీరబల్లిలోని ప్రభుత్వ వైద్యాధికారులు పరీక్షలు నిర్వహించి.. ఎలాంటి ప్రమాదం లేదని చెప్పారని ఎంఈఓ గిరి వరదయ్య తెలిపారు. నిర్లక్ష్యం వహించిన పాఠశాల ఇన్‌చార్జి హెచ్ఎంకు, పాఠశాలలోని మరొకరికి డీఈఓ రాఘవరెడ్డి మెమోలు జారీ చేసినట్లు ఎంఈఓ తెలిపారు. ఇక మీదట ఇలాంటి సంఘటనలు జరిగితే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరించారు.

ద్విచక్ర వాహనాలు ఢీకొని ఇద్దరికి గాయాలు

రామసముద్రం : రెండు ద్విచక్రవాహనాలు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరికి గాయాలైన సంఘటన రామసముద్రం మండలంలో సోమవారం సాయంత్రం చోటు చేసుకుంది. వివరాలిలా ఉన్నాయి. రామసముద్రం ఎగువపాళ్యంలో కాపురమున్న ఎంఆర్‌పీఎస్ నాయకులు శ్రీనివాసులు సబ్‌స్టేషన్‌కు వెళ్లి ప్రధాన రోడ్డులోకి వస్తున్నాడు. రామసముద్రంలో కోటక్ మహేంద్ర బ్యాంకులో మేనేజర్‌గా పని చేస్తున్న మహేష్ విధులు ముగించుకుని పుంగనూరుకు వెళ్తున్నాడు. వీరి ద్విచక్రవాహనాలు ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో శ్రీనివాసులుకు గాయాలు అయ్యాయి. స్థానికులు 108 వాహనానికి సమాచారం అందించి చికిత్స నిమిత్తం పుంగనూరు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. రామసముద్రం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

గువ్వలచెరువు ఘాట్ రోడ్డులో కారు బోల్తా

తప్పిన ప్రమాదం



బోల్తా పడిన కారు

రామాపురం : కర్నూలు–చిత్తూరు 40వ నంబర్ జాతీయ రహదారిలోని గువ్వలచెరువు ఘాట్ రోడ్డు రెండో మలుపు వద్ద సోమవారం కారు బోల్తాపడింది. చిత్తూరు నుంచి కారులో కడపకు వస్తుండగా ఈ ప్రమాదం చోటు చేసుకోగా ప్రయాణికులకు ఎలాంటి గాయాలు కాలేదు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ కొండారెడ్డి తెలిపారు.

స్పెషల్ డ్రైవ్‌లో 242 కేసులు

కడప అర్బన్ : జిల్లాలో పోలీసులు సోమవారం చేపట్టిన స్పెషల్ డ్రైవ్‌లో భాగంగా నిబంధనలు ఉల్లంఘించి వాహనాలను నడిపిన వారిపై మొత్తం 242 కేసులు నమోదు చేశారు. ఇందులో ప్రధానంగా హెల్మెట్ ధరించకుండా వెళ్తున్న ద్విచక్ర వాహనాలు, కార్లు, జీపులు, తదితర వాహనచోదకులపై 25 కేసులు నమోదు చేసినట్లు జిల్లా ఎస్పీ అన్బురాజన్ తెలియజేశారు.